సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 8 । మే । 2024



అక్రమ రవాణాకు అడ్డుకట్ట

మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. IIలో



అరటి తోటలు నేలమట్టం

అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మంగళవారం వీచిన ఈదురుగాలులకు అరటి తోటలు నేలమట్టమయ్యాయి. IIలో



వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు.

వైభవంగా చందన గోష్టి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీరామ దీక్షధారులకు చందన గోష్టి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి యేటా రామ మాలధారణ చేసిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు చందనం రాసి సత్కరించడం అనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 150 మంది స్వాములు పాల్గొనగా వారికి అల్పాహారం అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఈనెల 4వ తేదీన గాలి దుమారం, వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లగా మరమ్మతుల అనంతరం పునరుద్ధరించినట్లు విద్యుత్ ఎస్‌ఈ కె.రమేష్ తెలిపారు. కొత్తగూడెం పట్టణంతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గుండాల మండలాల్లో 110 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని, వైర్లు తెగిపోయాయని చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారని, రాత్రింబవళ్లు శ్రమించి సరఫరా పునరుద్ధరించారని తెలిపారు. మరమ్మతు పనులను ఎస్‌ఇ రమేష్, డీఈలు పీఎస్‌వీఎస్ నందయ్య, బి.వెంకటరత్నం, పి.హేమచంద్రబాబు, ఏడీఈ జె లక్ష్మణ్ తదితరులు పర్యవేక్షించారు.

పట్టభద్రుల స్థానానికి 14 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, పక్కన జగదీష్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ నుంచి ఈడ శేషగిరిరావు, శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్, యువతరం పార్టీ నుంచి బండారు నాగరాజు నామినేషన్లు సమర్పించారు. అలాగే, స్వతంత్రులుగా అయితగోని రాఘవేంద్ర, పిడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, మారం వెంకట్‌రెడ్డి, గుగులోతు బీమా, డాక్టర్ పెంచాల శ్రీనివాస్, కంటే సాయన్న, ధైద సోమసుందరం, అల్వాల కనకరాజు నామినేషన్ వేశారు. అభ్యర్థుల నుంచి ములుగు జిల్లా అదనపు కలెక్టర్, పట్టపద్రుల నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్.మహేందర్‌జీ నామినేషన్లు స్వీకరించారు.

ఈఏపీ సెట్ ప్రశాంతం



విద్యార్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్ : ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం స్థానిక అబ్దుల్ కలాం కళాశాలలో నిర్వహించిన ఈఏపీ సెట్ తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. మొదటి సెషన్‌లో 130 మందికి గాను 126 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో సెషన్‌లో కూడా 126 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికంటే గంటన్నర ముందుగానే విద్యార్థులను లోపలికి అనుమతించారు.

ఏజెన్సీని పట్టించుకోవడం లేదనే విమర్శలు..

- భద్రాచలంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు డిమాండ్
- రామాయణ కారిడార్, టూరిజం హబ్ ఏర్పాటుచేయాలి
- భద్రాచలం వరకు రైల్వే లైన్ పొడిగించాలి
- ఎన్నికల వేళ పలు పార్టీలు, సంఘాల నేతల విన్నపం

భద్రాచలం పట్టణ వ్యూ



భద్రగిరికి న్యాయం చేయాలి



భద్రాచలం: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గిరిజనులకు భద్రాచలం కేంద్రంగా ఉంది. రాష్ట్రంలోనే అతి పెద్ద ఏజెన్సీ ప్రాంతంగా గుర్తింపు పొందిన ప్రాంతమిది. వివిధ జాతుల ఆదివాసీలు, గిరిజనులు వారి సంస్కృతి, సంప్రదాయాలకు నెలవై ఉన్న కేంద్రంగా విరాజిల్లుతోంది. అయితే అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. ప్రభుత్వాలు అందిస్తున్న స్వయం ఉపాధి, ఇతర పథకాలు కొంతమేర మాత్రమే సత్ఫలిస్తున్నాయనే అపవాదు ఉంది. ఏజెన్సీలో ఇప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు అందని గ్రామాలెన్నో ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలానికి కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదని పలు పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు అంటున్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'గిరిజనులకు కేంద్రం అందించాల్సిన అభివృద్ధి' అనే అంశంపై సాక్షి అన్ని వర్గాల వారి అభిప్రాయాలను సేకరించింది.

గిరిజనులకు అనాదిగా అన్యాయం..

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులకు కేంద్ర ప్రభుత్వాలు అనాదిగా అన్యాయం చేస్తూనే ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. పలు గ్రామాలను ఏపీలో విలీనం చేయడం, భద్రాచలం కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీని తరలించడం వంటివి తీరని వ్యథగానే మిగిలాయని అంటున్నారు. కేంద్రంలో త్వరలో కొలువుదీరనున్న ప్రభుత్వం అయినా భద్రాచలంలో విద్య, వైద్యం, రవాణా, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. నాలుగు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న భద్రాచలం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



నాలుగు రాష్ట్రాల గిరిజనుల వైద్య సేవలకు ఇప్పటికీ భద్రాచలమే దిక్కు. అరకొర వైద్యులు, సిబ్బంది, వసతులతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. భద్రాచలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి. ప్రతీ ఆదివాసీ గిరిజనుడికి ఉచిత వైద్యం పటిష్టంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

– ముర్ల రమేష్, ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. వారికి ఉన్నత విద్య అందేలా భద్రాచలంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. గతంలో హామీ ఇచ్చి మాట తప్పి ఇతర జిల్లాకు కేటాయించి అన్యాయం చేశారు. అలాగే సెంట్రల్ సిలబస్ ఆధారిత నవోదయ, ఇతర టెక్నికల్ పాఠశాలలను, కళాశాలలను భద్రాచలంలో ఏర్పాటు చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి.

– మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు

విలీన గ్రామాలను కలపాల్సిందే..



రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న పిచుకలపాడు, కన్నాయిగూడెం, గుండాల, పురుషోత్తపట్నం, యటపాక గ్రామాలను ఏపీలో కలిపి భద్రాచలానికి తీరని అన్యాయం చేశారు. దీంతో పట్టణ అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. ఈ గ్రామాలను తిరిగి భద్రాచలంలో కలిపేలా కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయాలి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించాలి.

– రావులపల్లి రవికుమార్, సీపీఐ నేత

పారిశ్రామిక కారిడార్ నెలకొల్పాలి



భద్రాచలంతో పాటు ఏజెన్సీలోని ఇతర ప్రాంతాల్లో గిరిజనులకు స్వయం ఉపాధి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి వారికి చేయూత అందించాలి. ప్రధానంగా తునికాకు సేకరణ జరిగే ఈ ప్రాంతంలో బీడీ పరిశ్రమ ఏర్పాటుచేయాలి. స్వయం ఉపాధి పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి. నిరుద్యోగులకు ఉద్యోగం లభించేలా గిరిజన పారిశ్రామిక కారిడార్‌ను భద్రాచలంలో ఏర్పాటు చేయాలి.

– రావులపల్లి రాంప్రసాద్, బీఆర్‌ఎస్ నేత

పెసా చట్టాన్ని కఠినంగా అమలుపర్చాలి



ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేలా కేంద్రం కృషి చేయాలి. ఆదివాసీ ప్రాంతాల వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలయ్యేలా ప్రత్యేక కార్యచరణ అమలు చేయాలి. మైనింగ్ దోపిడీని అరికట్టేలా ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. గిరిజనులకు సంక్షేమ రాజ్యం అమలుపై కేంద్రం దృష్టి పెట్టాలి.

– కోటా దేవాదానం, న్యాయవాది, ఆదివాసీ హక్కుల పోరాట నాయకుడు

రామాయణ కారిడార్ అనుసంధానం చేయాలి



భద్రాచలం ఆధ్యాత్మిక కేంద్రంగా, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి అయ్యేలా రామాయణ కారిడార్‌తో ఈ పుణ్యక్షేత్రాన్ని అనుసంధానం చేయాలి. దేశంలోని పలు దివ్యక్షేత్రాలతో దీన్ని కలపడం వల్ల దక్షిణ అయోధ్యకు జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుంది. భద్రాచలం, పరిసర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను, అటవీ అందాలను వీక్షించేలా భద్రాచలం కేంద్రంగా టూరిజం హబ్ ఏర్పాటు చేయాలి.

– బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, భద్రాచలం పరిరక్షక వ్యవస్థాపక నాయకుడు

రైల్వేలైన్ అందుబాటులోకి తేవాలి



భద్రాచలం పరిసర ప్రాంత ప్రజలకు, భక్తులకు తీరని కలగా ఉన్న రైల్వే సౌకర్యం కల్పించేలా కొత్తగా కేంద్రంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పాండురంగాపురం నుంచి సారపాక వరకు, ఇంకా సాధ్యమైతే భద్రాచలం వరకు పొడిగించాలనే ప్రజల డిమాండ్‌ను తక్షణమే తీర్చాలి. ప్రతిపాదన దశలో ఉన్న మల్కనగిరి – భద్రాచలం రైల్వే లైన్ ఏర్పాటుకు చొరవ చూపాలి.

– పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే

ఇండియా కూటమిదే విజయం

- రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం
- పాత, కొత్త నాయకులకు ప్రాధాన్యత
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

దమ్మపేట : కేంద్రంలో ఈసారి ఇండియా కూటమినే అధికారంలోకి వస్తుందని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఈ విషయం అర్థం అవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గండుగులపల్లిలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కమిటీల ఆధ్వర్యంలో ప్రతి ఓటరును మూడు సార్లు కలవాలని, రాష్ట్రంలో ఈ ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసింది, ఆ తర్వాత ఏం చేయబోతోందో వివరించాలని తెలిపారు. మండల సమన్వయ కమిటీలు, బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తద్వారా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని అభినందించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల్లో పాతవారికి తగిన ప్రాధాన్యత ఇస్తూనే కొత్త వారిని కాపాడుకుంటామని అన్నారు. మండల, గ్రామ స్థాయిల్లో నాయకులు ఒంటెద్దు పోకడలకు స్వస్తి పలికి, సమన్వయంతో పనిచేయాలని, ఇందిరమ్మ రాజ్య స్థాపనకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, పోడు భూముల విషయంలో చట్ట సవరణ చేస్తామని ప్రకటించారు. ఎన్నికల అనంతరం కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లతో పాటుగా, ఈ నియోజకవర్గానికి ఐదు వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జారే అధ్యక్షతన, నియోజకవర్గ పరిధిలోని 184 బూత్ కమిటీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం జరుగుతుండగానే, వేగంగా వీచిన గాలితో టెంట్లు కూలిపోయాయి. సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య, సలీం, కట్రం స్వామి దొర, జూపల్లి రమేష్, రావు గంగాధరరావు, అలపాటి ప్రసాద్, బత్తుల అంజి, పర్సా వెంకట్, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ, కే.వీ. సత్యనారాయణ, కక్కిరాల రమేష్, ఈశ్వరప్రగడ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

రఘురాముడు గెలిస్తే అభివృద్ధి..

సినీ హీరో వెంకటేష్



మాట్లాడుతున్న వెంకటేష్, పక్కన రేణుకాచౌదరి, పొంగులేటి తదితరులు

కొత్తగూడెంరూరల్ : ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలిస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన కూతురును రఘురాంరెడ్డి ఇంటికే కోడలిగా పంపించానని, వారిది ప్రేమానురాగాలు గల కుటుంబమని చెప్పారు. ఆయన గెలిస్తే ఉమ్మడి జిల్లా ప్రజలను కూడా ప్రేమగా చూసుకుంటారని అన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటేసి రఘురాంరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని అవుతారని, రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అభ్యర్థి రఘురాంరెడ్డి, ఎంపీ రేణుకాచౌదరి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ, ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగేంద్రత్రివేది, నాగా సీతారాములు, బోయిన సురేష్, శంకర్ నాయక్, ఎండీ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి మున్సిపల్ వైస్ చైర్మన్



జానీపాషాతో పొంగులేటి, ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు : ఇల్లెందు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌డీ జానీపాషా, వార్డు కౌన్సిలర్లు గిన్నారపు రజిత, సయ్యద్ ఆజం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, డీసీసీబీ డైరెక్టర్ జనగాం కోటేశ్వరరావు, బీఆర్‌ఎస్ ఇల్లెందు పట్టణ ఉపాధ్యక్షుడు పెండెల హరికృష్ణ, ఎస్సీ సెల్ ఇన్‌చార్జ్ మేకల శ్యామ్, మాజీ కౌన్సిలర్ పర్రె స్వర్ణలత శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు నూకల మురళీకృష్ణ యాదవ్, పాలెపు ఆనంద్, ఆదూరి రవి, బుర్ర రమేష్, బుల్లి ఐలయ్య, బోశాల దుర్గారావు, బొల్లం సతీష్, సామంతుల అశోక్ తదితరులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పార్టీని వీడడం గులాబీ నేతలకు పెద్ద షాక్‌గా చెప్పొచ్చు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మేకల మల్లిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి



ములకలపల్లి : వలస గొత్తికోయలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన 344 బ్యాలెట్ యూనిట్లను రాజకీయ నాయకుల సమక్షంలో ర్యాండమైజేషన్ చేశామని తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గానికి 20, కొత్తగూడెం నియోజకవర్గానికి 32 కంట్రోల్ యూనిట్లు కేటాయించామని చెప్పారు. సమావేశంలో అధికారులు దారా ప్రసాద్, రంగాప్రసాద్, ఎన్‌ఐసీ సుశీల్, నవీన్, పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్ అగర్వాల్, నోముల రమేష్, ఆనందరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

పాల్వంచ : పట్టణ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పాల్వంచలోని అంబేద్కర్ సెంటర్, శాస్త్రిరోడ్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు సక్రమంగా రావడం లేదని, చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, చెత్త సేకరణ వాహనాలు నిత్యం పంపించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, తహసీల్దార్ వివేక్, ఏఈ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ములకలపల్లి: పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. మండలంలోని పూసుగూడెం, జగన్నాథపురం, పాతగంగారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా టెంట్ వేయాలన్నారు. ఆ తర్వాత సుబ్బనపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడి పనుల కేటాయింపు, బిల్లుల చెల్లింపులపై ఆరాతీశారు. పాతగంగారం శివారు వాగొడ్డు గుంపు గొత్తికోయ గ్రామానికి పోలీసు వాహనంలో వెళ్లి ఆదివాసీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మనఊరు – మనబడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆమె వెంట డీపీఓ చంద్రమౌళి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్, నళిని, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ లక్ష్మయ్య ఉన్నారు.

సమయం లేదు మిత్రమా...

- ముగింపు దశకు లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- పట్టణాలు, మండల కేంద్రాల్లో విస్తృతంగా రోడ్డు షోలు
- ఓటర్లను ఆకర్షించే పనిలో రాజకీయ పార్టీలు
- ఆఖరి ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం ముగింపు దశకు చేరుతోంది. ఈనెల 11న సాయంత్రం 6 గంటల వరకు ప్రచారానికి అవకాశముండగా.. మిగిలిన తక్కువ సమయంలో ముఖ్య నేతలను రప్పించి పట్టణాలు, మండల కేంద్రాల్లో రోడ్డు షోలు నిర్వహించేలా పార్టీలు ప్రణాళిక రూపొందించాయి. ఆఖరు ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకునేలా సుడిగాలి పర్యటనలకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ముఖ్య నేతల పర్యటనలు ఇప్పటికే ముగిశాయి. ఇక ఈ నాలుగు రోజుల్లో కొందరు నేతలను రప్పించి ప్రచారం హోరెత్తించడంపై దృష్టి సారించారు.

హోరాహోరీగా..

ఖమ్మం లోక్‌సభ బరిలో 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గతనెల 18 నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా.. ఈనెల 13న పోలింగ్ జరగనుంది. అయితే, నామినేషన్లకు ముందే బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులుగా నామా నాగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావును ప్రకటించారు. ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని బరిలోకి దింపింది. ఆర్భాటం లేకుండా నామినేషన్లు వేసిన అభ్యర్థులు ప్రచారం మాత్రం హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన ఆలస్యం కావడంతో తొలుత ఎన్నికల జోష్ రాలేదు. రఘురాంరెడ్డిని ప్రకటించాక కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ ప్రచారాన్ని కదం తొక్కించాయి. పోటాపోటీగా నియోజకవర్గ, పార్లమెంట్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించడమే కాక అభ్యర్థులు, నేతలు పల్లెలు, పట్టణాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ఇకపై ఇంటింటికీ..

ఓటర్లను ఆకర్షించే పనిలో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. ఇన్నాళ్లు రోడ్డు షోలు, సభలకే పరిమితం కాగా ప్రస్తుతం ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టాయి. ఖమ్మం కార్పొరేషన్, మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో రాజకీయ పార్టీల తరఫున నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, పోస్టర్లు ఇస్తూ తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. బూత్ కమిటీలు ఈ ప్రచారాన్ని కీలకంగా తీసుకున్నాయి. ప్రచార గడువు ముగిసే వరకు ఈ ప్రక్రియ కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు.

పోల్ మేనేజ్‌మెంట్ పై దృష్టి..

హంగూ ఆర్భాటాలతో ప్రచారం చేసినా చివరకు పోల్ మేనేజ్‌మెంట్ చేయకపోతే విజయావకాశాలు సన్నగిల్లుతాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. దీంతో కోలాహలంగా ప్రచారం చేయిస్తున్న అభ్యర్థులు మరోవైపు పోల్ మేనేజ్‌మెంట్‌పైనా దృష్టి సారించారు. గత రెండు, మూడు ఎన్నికల్లో తమ పార్టీకి పోల్ అయిన ఓట్లు ఎన్ని, అప్పుడు ఏ ప్రాంతాల్లో తగ్గాయో బేరీజు వేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పార్టీల వారీ ఓట్లతో పాటు కులాల వారీగా ప్రతీ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు ఉన్నాయో లెక్కలు తీశారు. వీటి ఆధారంగా పోల్ మేనేజ్‌మెంట్ ఎక్కడ ఎలా చేస్తే గెలుస్తామనే అంశంపై కసరత్తు చేపట్టి.. చివరి అంశం విజయవంతంగా పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

అతిరథులతో ప్రచా'రణం'

బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు తరఫున కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ప్రచారానికి వచ్చారు. అలాగే, బస్తర్ రాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ సైతం ఖమ్మంలో ప్రచారానికి హాజరయ్యారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోసం మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం, కొత్తగూడెంలో రోడ్డు షో చేశారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రచారానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. మరోపక్క కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతుగా సినీ హీరో వెంకటేశ్ మంగళవారం ఖమ్మం, కొత్తగూడెంలో ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ముఖ్య నేతలను రప్పించి పోటాపోటీగా ప్రచారం చేస్తుండడంతో ప్రసంగాల మోత మోగుతోంది.

క్లుప్తంగా

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు పీహెచ్‌సీని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో ఆమె మాట్లాడారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురై ఆస్పత్రికి వస్తే సత్వర వైద్యం అందించాలని పేర్కొన్నారు. అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి సకాలంలో మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించాలని, ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పుల య్యేలా ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు తేజస్వి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి గుడిలో దుకాణాలకు నేడు వేలం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో దుకాణాలు అప్పగించేందుకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ జి.సుదర్శన్ తెలిపారు. ఆలయ సముదాయంలోని 1 నుంచి 4వ నంబర్ దుకాణాలతో పాటు తలనీలాలు, చీరలు పోగు చేసుకోవడం, పూల దండల విక్రయం, ఫొటో తీసేందుకు మూడేళ్ల పాటు హక్కు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, టికెట్లు, వాల్‌పోస్టర్ల ప్రింటింగ్, పూల దండలు, ఎలక్ట్రికల్ సామగ్రి, స్టేషనరీ, పాలు, పెరుగు, కూరగాయల సరఫరా పది నెలల కాలపరిమితితో అప్పగిస్తామని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉదయం 10 గంటల్లోగా రూ.200 చెల్లించి షెడ్యూల్ తీసుకోవాలని, అందులో పేర్కొన్నట్లుగా ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈఓ సూచించారు.

రూ.2.50 లక్షల నగదు సీజ్



నగదు స్వాధీనం చేసుకుంటున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు రూరల్ : సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.50 లక్షల నగదును ఎన్నికల కోడ్ నేపథ్యంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు మంగళవారం సీజ్ చేశారు. పట్టణంలో అంబేద్కర్ సెంటర్‌లో సీఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్ర వాహనదారుడు రూ.2.50 లక్షలను తీసుకెళ్తున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు సోదా చేయగా.. అతడి వద్ద రూ.2.50 లక్షల నగదు లభ్యమైంది. సీజ్ చేసిన నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి అందజేశారు.

యువతి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. అశ్వారావుపేట నందమూరి నగర్‌కు చెందిన 22 ఏళ్ల యువతి సోమవారం ఉదయం సత్తుపల్లిలోని ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. యువతి కుటుంబీకులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. యువతి తల్లి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శివాలయంలో చోరీ

ములకలపల్లి: ములకలపల్లి శివారులోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం ఉదయం గుడి తలుపులు తెరచి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా.. గర్భగుడి తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఉత్సవమూర్తుల రెండు వెండి కిరీటాలు, శఠగోపం, దేవతామూర్తుల రెండు జతల బంగారు మంగళసూత్రాలు, హుండీలోని సుమారు రూ.ఐదు వేలు చోరీ అయినట్లు గుర్తించారు. ఈ మేరకు ఎస్సై రాజమౌళి వివరాలు సేకరించారు. ఆలయ అర్చకులు విస్సావఝ్జల సురేశ్ శర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సుజాతనగర్ : ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై సుజాతనగర్ పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. యువతితో కలిసి ఫొటోలు దిగిన యువకుడు.. తనను ప్రేమించకపోతే ఫొటోలు అందరికీ చూపిస్తానని బెదిరిస్తున్నాడు. ఈ విషయాన్ని యువతి తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జుబేదాబేగం తెలిపారు.

సకుటుంబ సపరివార సమేతం

- ఎండను లెక్కచేయకుండా అభ్యర్థుల కుటుంబీకుల ప్రచారం
- బిజీబిజీగా నేతల కుటుంబ సభ్యులు
- గెలుపే లక్ష్యంగా సుడిగాలి పర్యటనలు
- కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారంలో సినీ హీరో వెంకటేశ్



కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి తరఫున ప్రచారంలో ఆయన పెద్ద కోడలు అశ్రిత, చిన్నకుమారుడు - కోడలు అర్జున్‌రెడ్డి, సప్నిరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: భరించలేనంత ఎండ.. 45 డిగ్రీలు దాటుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల కుటుంబీకులు సైతం రంగంలోకి దిగారు. ప్రచార గడువు సమీపిస్తుండటంతో నిప్పుల కొలిమిలా ఉన్న వాతావరణాన్ని భరిస్తూ ప్రచారంలో పాల్గొంటున్నారు. తమ వారిని గెలిపించుకుని ఆ ఆనందాన్ని కళ్లారా చూసేందుకు గ్రామాలు, పట్టణాలను చుట్టేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రధాన పార్టీల అభ్యర్థుల సతీమణులు, కుమారులు, కోడళ్లు, వియ్యంకులు ఇలా సకుటుంబ సపరివార సమేతంగా ప్రచారం నిర్వహిస్తుండటం విశేషం.

బిజీబిజీగా..

లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికల్లో తమ వారిని గెలుపించుకునేందుకు నేతల కుటుంబ సభ్యులు బిజీబిజీగా గడుపుతున్నారు. ఎక్కడో హైదరాబాద్‌లో ఉంటూ తమ వ్యాపారాలను చూసుకునేవారు సైతం ఇక్కడే మకాంవేసి ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి తరఫున ఆయన వియ్యంకుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపు బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని పర్యటిస్తున్నారు. ఇక మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి సైతం ప్రచార రంగంలోకి దిగారు. అలాగే, శ్రీనివాసరెడ్డి భార్య మాధురి, ప్రసాద్‌రెడ్డి భార్య శ్రీలక్ష్మి, రఘురాంరెడ్డి కోడళ్లు సప్నిరెడ్డి, అశ్రిత, కుమారుడు అర్జున్‌రెడ్డి కూడా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. మరోపక్క రఘురాంరెడ్డి వియ్యంకుడు, హీరో వెంకటేశ్ సైతం ఖమ్మం, కొత్తగూడెంలో మంగళవారం జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు సతీమణి తాండ్ర వినీలరావు సైతం నియోజకవర్గాన్ని చుట్టేస్తూ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కుమారుడు భవ్యతేజ, వారి అన్న కుమారుడు నామ సాయిరాం ప్రచారంలో పాల్గొంటున్నారు. నేడో రేపో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సతీమణి తమ్ముడు, హీరో తొట్టెంపూడి వేణు సైతం ప్రచారానికి వస్తారని చెబుతున్నారు.



బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు తరఫున ప్రచారంలో ఆయన సతీమణి వినీల



బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తరఫున ప్రచారంలో కుమారులు పృథ్వీతేజ, భవ్యతేజ, సాయిరాం

ఎండను లెక్కచేయకుండా..

మండే ఎండను సైతం లెక్కచేయకుండా తమవారి గెలుపుకోసం పనిచేస్తున్నారు. ఈ వాతావరణానికి, వడగాల్పులకు అత్యవసరం ఉంటే తప్పా ఎవరూ బయటకు రావొద్దని ప్రభుత్వం ఆరెంజ్ అలెర్ట్ జారీచేసింది. అయినా తమ గెలుపు ఆనందాన్ని ఆస్వాదించడానికి.. ఐదేళ్ల పదవి కోసం అష్టకష్టాలు, పడరాని పాట్లు పడుతున్నారు. 45 డిగ్రీలకు పైగా ఎండలు దంచికొడుతున్నా వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా తమ ప్రచారం కొనసాగిస్తున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

అక్రమ రవాణా అడ్డుకట్టకు చర్యలు

చెక్‌పోస్టుల తనిఖీలో ఎస్పీ రోహిత్‌రాజు



అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద సూచనలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

అశ్వారావుపేట/దమ్మపేట: మద్యం, నగదు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. మంగళవారం అశ్వారావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉందని.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 12 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 4 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా ఇప్పటివరకు రూ.1,19,50,531 నగదు, రూ.16,37,324 విలువైన 2,502 లీటర్ల మద్యం, రూ.2,06,85,300 విలువ గల 828 కిలోల గంజాయి, రూ.11,22,000 విలువ గల బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రూ.3,53,95,155 విలువైన అనధికార ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అనంతరం పెనగడప, దమ్మపేట మండలం మందలపల్లి, అల్లిపల్లి, అశ్వారావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. వ్యవసాయ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్, అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాస్, శివరామకృష్ణ, సాయికిశోర్‌రెడ్డి ఉన్నారు.

మనమే అభివృద్ధి చేసుకుందాం..



మాట్లాడుతున్న తాండ్ర వినోద్ రావు, పక్కన నాయకులు

దమ్మపేట: 'మన ప్రాంతాన్ని మనమే అభివృద్ధి చేసుకుందాం' అని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రం, శివారులోని నెమలిపేటలో ఎన్నికల శంఖారావ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ.. ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే దానికి కారణం ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశ సరిహద్దుల్లో రక్షణ వ్యవస్థ బలీయంగా ఉండటమేనని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో చాలా వెనుకబడిందని, సరైన ఆస్పత్రులు, పరిశ్రమలు లేవని, పామాయిల్ పంటకు ప్రసిద్ధి గాంచిన ఈ నియోజకవర్గంలో పామాయిల్ బోర్డు లేకపోవడం శోచనీయమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. తొలుత కాకతీయ వంశస్తుడు, బస్తర్‌రాజు మహారాజ్ కమల్‌చంద్ర భంజ్‌దేవ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆదివాసీలకు, హరిజనులకు కీలకమైన పదవులిచ్చారని, ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా, ఆదివాసీ నాయకుడిని సీఎంగా చేసిన ఘనత మోదీకే దక్కుతుందని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి విజయరామారావు మాట్లాడారు. కార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరరావు, రంగాకిరణ్, ఉతడనేని విశ్వేశ్వరరావు, కోలికపోగు కాంతారావు, మడకం రవి, పోలయ్య, పసుమర్తి పుల్లారావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ గేమ్స్ సెక్రటరీగా టి.మహేశ్

గోప్యంగా ఉంచడంపై గుర్రుమంటున్న క్రీడాకారులు

పాల్వంచ: కేటీపీఎస్ ఏడో దశ, ఓఅండ్ఎం నూతన గేమ్స్ సెక్రటరీగా టి.మహేశ్ నియమితులయ్యారు. చైర్మన్‌గా సీఈ పి.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఎస్ఈ ఎస్.యుగపతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా హెచ్ఆర్ ఏఎం అన్నారపు శ్రీనివాస్, ట్రెజరర్‌గా ఎస్ఏఓ ఎన్.లెనిన్‌కృష్ణప్రసాద్, లేడీస్ రిప్రెజెంటేటివ్‌గా జేఏఓ కె.పద్మ యథాతథంగా కొనసాగనున్నారు.

అంతా గోప్యం

కేటీపీఎస్ ఏడోదశ గేమ్స్ సెక్రటరీగా పనిచేస్తున్న వై.వెంకటేశ్వర్లు గత ఏప్రిల్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చెందారు. ఆయన స్థానంలో ఏఈగా విధులు నిర్వహించే టి.మహేశ్‌ను నియమించారు. ఈ నియామకపత్రంపై గత ఏప్రిల్ 30వ తేదీనే సీఈ సంతకం చేశారు. మరుసటి రోజు సీఈ అమెరికా పర్యటనలో భాగంగా సెలవు తీసుకున్నారు. అయితే, నియామక పత్రాన్ని ఇన్‌చార్జ్ సీఈ రాజ్‌కుమార్‌కు గానీ, సెక్రటరీగా ఉన్న ఎస్ఈ ఎస్.యుగపతికి గానీ ఇవ్వకుండా వెంకటేశ్వర్లు వద్దే ఉంచుకుని మంగళవారం ఇన్‌చార్జ్ సీఈకి సమర్పించడంతో గందరగోళం నెలకొంది. కనీస సమాచారం లేకుండా ఏకపక్షంగా నియామకం చేపట్టారని, కాంప్లెక్స్‌లోని క్రీడాకారులెవరికీ సమాచారం ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ సీఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా 1వ తేదీ నుంచి సెలవులోకి వెళ్లే ముందే సీఈ లెటర్ ఇచ్చిన విషయం తమకు మంగళవారమే తెలిసిందని, ఎవరికీ సమాచారం కూడా లేదని, దీనినే ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

పలు యూనియన్ల వినతి

ఈ నియామకం సరికాదని, గతంలో పనిచేసిన అనుభవం ఉన్న వారిలో సీనియర్‌లకు గానీ, ఏడీఈకి గానీ ఇవ్వాల్సి ఉందని, లేనిపక్షంలో నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరిపించాలని పలు యూనియన్ల నాయకులు హెచ్ఆర్ డైరెక్టర్, ఇన్‌చార్జ్ సీఈలకు వినతిపత్రాలు సమర్పించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ బండి నాగరాజు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు రావుల మురళి ఉన్నారు.

బీటీపీఎస్ కీర్తి ప్రతిష్టలు పెంచాలి



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్: క్రీడా రంగంలో ఉద్యోగులు నైపుణ్యం ప్రదర్శించి బీటీపీఎస్ కీర్తి ప్రతిష్టలు పెంచాలని సీఈ బి.బిచ్చన్న పిలుపునిచ్చారు. పాల్వంచ కేటీపీఎస్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కబడ్డీ, అథ్లెటిక్స్ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ ఉద్యోగులు ప్రతిభ కనబర్చి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కాగా, మంగళవారం వారు సీఈని మర్యాదపూర్వకంగా కలవగా, బిచ్చన్న వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్ జెన్‌కో నాణ్యమైన విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. సంస్థ క్రీడాకారులను సైతం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.పార్వతి, స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నరసింహరావు, జట్టు సభ్యులు బి.శేషయ్య, డి.రవి, డి.రమేష్, ఎస్.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, సీహెచ్. ప్రశాంత్, జి.సతీష్, వి.వేణు, కె.మధు, ఎన్.సురేష్, కె.రాము, ఎస్‌కే మొహినుద్దీన్, ఎండీ.అమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి అరటి తోటలు నేలమట్టం



గుర్రాలచెరువులో నేలమట్టమైన అరటి తోట

అశ్వారావుపేట/దమ్మపేట : అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మంగళవారం వీచిన ఈదురుగాలులు, గాలివానకు గుర్రాలచెరువు, పెద్దగొల్లగూడెం గ్రామాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. గుర్రాలచెరువు గ్రామానికి చెందిన కలపాల రామకృష్ణ 5 ఎకరాలు, చక్రాల చిట్టయ్య 10 ఎకరాలు, యారా లక్ష్మణ్‌రావుకు చెందిన 3 ఎకరాలతో పాటు పెద్దగొల్లగూడెంలో 30 ఎకరాల్లో అరటి బోదెలు గెలలతో సహా నేలమట్టమయ్యాయి. తిరిగి పునరుద్ధరించేందుకు వీల్లేకుండా సగానికి నరికినట్టుగా చెట్లు కూలిపోవడంతో రైతులు కుదేలయ్యారు. మరో వారం రోజులాగితే గెలలను మార్కెట్‌కు తరలించేలా తయారయ్యాయి. పంట చేతికొచ్చే సమయానికి ఇలా నష్టాలకు గురికావడం రైతులను తీవ్ర విషాదానికి గురిచేస్తోంది. ఒక్కో రైతుకు ఎకరానికి సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

చల్లని వాతావరణంతో ఉపశమనం

భద్రాచలంటౌన్: జిల్లాలో ప్రతిరోజు 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడడంతో పాటు జిల్లాలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మరో మూడు రోజులు కూడా వాతావరణం చల్లగా ఉండి వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పడంతో పాటు భద్రాద్రి జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. దీంతో ప్రజలు ఏసీలు, కూలర్లకు స్వస్తి చెప్పారు.

పాఠశాలలు తెరిచే నాటికి పనుల పూర్తి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభమయ్యే నాటికి మరమ్మతులు పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈ విషయంలో స్పెషల్ ఆఫీసర్లు చొరవ తీసుకోవాలని తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశమైన ఆయన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పనుల పురోగతిపై సమీక్షించారు. ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో ప్రతీ విద్యార్థికి మంచం ఏర్పాటు చేయాలని, నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాన్, లైట్ అమర్చాలని తెలిపారు. వేసవి సెలవుల్లోనే టాయిలెట్లు, బాత్రూంలు, బోర్ల మరమ్మతు చేయించాలని, పగిలిపోయిన స్విచ్ బోర్డులు, లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించాలని చెప్పారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇవ్వనున్నట్లు పీఓ తెలిపారు. సమావేశంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు రమణయ్య, నర్సింహారావు, అశోక్‌కుమార్, మునీర్‌పాషా, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవం



ప్రసంగిస్తున్న సూర్యనారాయణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అధ్యక్షతన రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి సూర్యనారాయణ మాట్లాడారు. 1974లో డాక్టర్ మోహన్‌సింగ్ మెహతా కమిటీ సిఫారసు మేరకు దేశంలో మొదటగా పాండిచ్చేరిలో మొదటి కేవీకేను ఏర్పాటు చేశారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 731 కేవీకేలు ఏర్పాటయ్యాయని వివరించారు. కేవీకే ఏర్పాటు ప్రధాన ఉద్దేశం నాణ్యమైన విత్తనాలు వినియోగించి రైతులు అధిక దిగుబడులు సాధించడమని తెలిపారు. రైతులు లాభసాటి వ్యవసాయం చేయడానికి కేవీకే శాస్త్రవేత్తలు కృషి చేస్తారని చెప్పారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు వేసే విధంగా రైతులను చైతన్యం చేయడంతో పాటు విత్తనాల సరఫరాను కూడా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, శాస్త్రవేత్త శివ, యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.

వంద కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితుడిని చూపిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎక్సైజ్ శాఖ అధికారులు ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం మంగళవారం వివరాలు వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులకు ఓ వ్యక్తి కారులో వంద కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న రెండు మొబైళ్లు స్వాధీనం చేసుకుని, కారు సీజ్ చేసి కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. విచారణలో ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు తేలిందని, గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ సీతారామరాజు, సిబ్బంది అలీ, బాబు, లలిత, వీరబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ శ్రీను కథనం మేరకు.. ఏపీలోని కాకినాడ జిల్లా రౌతంపూడి మండలం బలరామపురం గ్రామానికి చెందిన దాసరి సూరిబాబు (40) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట అశ్వారావుపేటకు చెందిన తాపీ మేస్త్రీ లక్ష్మణ్‌రావు అశ్వారావుపేటలో ఓ భవన నిర్మాణ పనులు చేసేందుకు సూరిబాబుతోపాటు కొద్ది మంది కార్మికులను తీసుకొచ్చాడు. వీరంతా స్థానికంగా నిర్మాణంలో ఉన్న భవనంలో నివాసం ఉంటూ, పనులు చేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగిసిన తర్వాత సూరిబాబు స్నానం చేసిన అనంతరం తడిసిన టవల్‌ను పిల్లర్లకు కట్టి ఉన్న మోటారు వైరుపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. తోటి కూలీలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్నయ్య దాసరి అప్పన్నబాబు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బతో కూలీ మృతి

పాల్వంచ: వడదెబ్బకు గురై భవన నిర్మాణ కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొత్తగూడెం రామవరానికి చెందిన ఈదునూరి కన్నయ్య (55) తోటి కూలీలతో కలిసి సోమవారం పాల్వంచలోని బాపూజీనగర్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్పృహతప్పి పడిపోగా తోటి కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం కన్నయ్య కూతురు రోజారాణి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు - బైక్ ఢీకొనడంతో...

కొణిజర్ల: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై జె.శంకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుండి కొత్తగూడెం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వైరా వైపు నుండి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గాంధీనగర్‌కు చెందిన కొరడాల రామకృష్ణ(40)గా గుర్తించారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు వాహనాలు నిలిచిపోగా, కొణిజర్ల, వైరా ఎస్సైలు చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్...



తేళ్లూరి కృష్ణ (ఫైల్)

తల్లాడ: మండలంలోని నూతనకల్-మల్సూర్‌తండా మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... కల్లూరు మండలం శాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ తేళ్లూరి కృష్ణ(62) మిట్టపల్లి నుంచి కల్లూరు వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో ఆటో నుంచి కింద పడిన ఆయనపై నుంచి గుర్తుతెలియని వాహనం వెళ్లడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జార్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జార్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.


ఇందు గుర్జార్

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!

‘‘సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్ళిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.



డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50– 100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసిఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెనింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరుచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే’’ అంటుంది ఇందు.

స్ఫూర్తి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది. ‘అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి’ ‘ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది’ ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు. వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది. ‘ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ’ అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

పరీక్షా కాలంలో పలికే చేయి

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత ‘గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్’లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. ‘ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి ‘ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?’ అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను’ అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. ‘అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు’ అంటుంది రమ. ‘అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టేవారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి’ అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

‘నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను’ అని ముగించింది రమా పద్మనాభన్.

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల ‘ఉద్యోగమే సర్వస్వం’ ‘ఉద్యోగం దొరికితే చాలు’ అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. ‘ఉద్యోగం ఎందుకు చేయాలి?’ నుంచి ‘చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి’ వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

యూత్ పల్స్

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

‘డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్’ అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు ‘ఉద్యోగ మార్పు’నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

‘పని ఒత్తిడి చచ్చినట్లు భరించాల్సిందే’ అని రాజీ పడడం కంటే ‘జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను’ అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ ‘ఇది కాదు జీవితం’ అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. ‘నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది’ అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోహ్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ‘ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి’ అంటుంది సారా.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ ‘టిగెల్’ చాకోలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. ‘టిగెల్’ స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. ‘చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది’ అంటుంది అనువ కక్కర్.



బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

‘ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది’ అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

‘ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది’ అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో ‘గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్’ వచ్చాయి. ‘గ్యాప్ ఎక్స్’ పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

‘యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు’ అంటున్నాడు ఢిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

రంగుల ప్రపంచానికి ఆవల...

● సోషల్ యాక్టివిస్ట్ ● ఫ్యాషన్ డిజైనర్ ● రైటర్ ● మోటివేషనల్ స్పీకర్

అదర్ సైడ్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది. అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు. స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది. తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...


కరీనా కపూర్

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ ‘గ్లోబస్’తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన ‘డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్’ పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. ‘ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా’ పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా బీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి ‘ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్’ డాక్యుమెంటరీపై పనిచేసింది. ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన ‘గర్ల్ రైజింగ్’ అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–ఓవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవి ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా ఠాగూర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్‌ఎస్‌ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. ఛత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. ‘నవజాత శిశువులను కాపాడుకుందాం’ పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి ‘ఎవ్రీ చైల్డ్ అలైవ్’ అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యునైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...‘నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను’ అంటుంది కరీనా కపూర్.

‘కరీనా కపూర్ ఎక్స్‌లెంట్ కమ్యూనికేటర్’ అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

> **చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి**
>
> 
>
> సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ‘నేను ఎలా సాధించానంటే’లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. ‘ఇదీ ఒక విజయమేనా!’ అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.
>
> – కరీనా కపూర్